

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ సోమవారం లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటెటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 8 అక్టోబర్ 2024 | HYDERABAD




ఉర్దూ మీడియంలో అన్ని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలంటూ.. సోమవారం స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. -చిక్కడపల్లి, అక్టోబర్ 7




# మెట్రో మార్గం గజిబిజి

## గందరగోళంగా రెండో దశ కారిడార్లు — క్షేత్రస్థాయిలో నోరుమెదపని అధికారులు

- కొత్త మార్గాల ప్రతిపాదనలపై మండిపడుతున్న నగరవాసులు
- జనం లేని ఫోర్త్ సిటీ మార్గంపై అభ్యంతరాలు
- సర్కారుకు క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించాల్సిన అధికారులు మౌనం
- ట్రాఫిక్ సర్వే, రైడర్ షిప్ అధ్యయనాలు పక్కకు

మహానగరంలో మెట్రో రైలు ఏ మార్గాల్లో అవసరమో అధికారులకు బాగా తెలిసే ఉంటుంది. అయినా వాస్తవ పరిస్థితులు, భవిష్యత్ అవసరాలు.. ప్రాజెక్టు ఆమోదయోగ్యమైనా.. అనే విషయాలను ప్రభుత్వానికి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కూడా వారిదే. ఎందుకంటే మెట్రో రెండో దశ ప్రాజెక్టు ప్రతిపాదనలపై నగరవాసుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రేవంత్ సర్కారు ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు మెట్రో మార్గంలో ప్రయాణికులు ఎవరైనా హైటెక్ సిటీ నుంచి విమానాశ్రయానికి వెళ్లాలంటే మూడు చోట్ల మెట్రో స్టేషన్లను మారాల్సి ఉంటుంది. పైగా ఉత్తర హైదరాబాద్‌ను విస్మరించడమే కాకుండా.. జనమే లేని ఫోర్త్ సిటీకి ఒకేసారి 40 కి.మీ మార్గాన్ని ప్రతిపాదించడం ఆయోదయోగ్యం కాదంటున్నారు. ఈ విషయంలో పాలకులు ఏదీ చెబితే అది..తల ఊపకుండా.. సర్కారుకు క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించాల్సిన అధికారులు మౌనం వహించడాన్ని తప్పపడుతున్నారు.

- సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తేతెలంగాణ)

- రేవంత్ సర్కారు ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు మెట్రో మార్గంలో ప్రయాణికులు ఎవరైనా హైటెక్ సిటీ నుంచి విమానాశ్రయానికి వెళ్లాలంటే మూడు చోట్ల మెట్రో స్టేషన్లను మారాల్సి ఉంటుంది. అదే గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించి పనులు సైతం ప్రారంభించిన ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ కారిడార్‌లో అయితే ఒక్కచోట మెట్రో స్టేషన్ మారితే చాలు.. నేరుగా శంషాబాద్ విమానాశ్రయం టర్మినల్‌కు చేరుకులా మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు.
- రేవంత్ సర్కారు రద్దు చేసిన పాత ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ మార్గం భవిష్యత్‌లో అవసరం.
- హైటెక్ సిటీ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే మెట్రో బ్లూ లైన్ (కారిడార్-3)లో నాగోల్ దాకా వెళ్లి అక్కడి నుంచి మరో మెట్రో స్టేషన్‌లోకి మారి శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలికి వెళ్లాలి. ఇలా వెళ్లాలంటే చాలా దూరం పెరుగుతుంది. ఇది విమానాశ్రయం వెళ్లే చాలా మంది ప్రయాణికులకు అనువైంది కాదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ కారిడార్ అన్ని విధాలుగా ఆమోదయోగ్యమైంది.
- రెండో దశ మెట్రో ప్రాజెక్టులో ఉత్తర హైదరాబాద్ ప్రాంతాన్ని పరిగణలోకి తీసుకోలేదు. అదే సమయంలో గత ప్రభుత్వం రెండు వేర్వేరు మెట్రో మార్గాలను ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికి ప్రతిపాదించింది. అందులో ఒకటి.. ప్యారడైజ్-మేడ్చల్ కండ్లకోయ, రెండోది.. జేబీఎస్ నుంచి అల్వాల్ మీదుగా శామీర్‌పేట వరకు ఉన్నాయి.
- మెట్రో మార్గం వేయాలంటే.. రైడర్‌షిప్, ట్రాఫిక్ సర్వే వంటి అంశాలు అత్యంత కీలకమైనవి. అలాంటి అంశాలను పట్టించుకోకుండానే, జనమే లేని ఫోర్త్ సిటీకి ఒకేసారి 40 కి.మీ మెట్రో మార్గాన్ని రెండో దశలో ప్రతిపాదించారు.

### ఉత్తర హైదరాబాద్ ఊసేలేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో రెండోదశ మెట్రో ప్రాజెక్టు అంటూ రకరకాల మెట్రో మార్గాలను ప్రతిపాదించింది. అలా సుమారు 8 నెలలు గడిచినా ఇంకా మెట్రో రూట్ల ప్రతిపాదన దగ్గరే అగిపోయింది తప్ప.. అడుగు ముందుకు పడలేదు. ఇప్పటికే రెండు మూడు సార్లు ప్రతిపాదనలు మార్చి ఇదే తుది రెండో దశ అంటూ ప్రకటించిన మెట్రో కారిడార్లపైనా నగర వాసులు పెదవి విరుస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 10 నెలలు గడిచింది. పనులు పురోగతిలో ఉన్న హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ కారిడార్ ప్రాజెక్టును రద్దు చేయడమే కాకుండా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మెట్రో కారిడార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పుడదే... ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌పై నగర వాసుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు ఉత్తర హైదరాబాద్ ప్రాంతాలకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించిన రెండు మెట్రో మార్గాలను అసలు పరిగణలోకే తీసుకోలేదు. దీంతో ఆ ప్రాంత వాసులంతా మేడ్చల్ మెట్రో సాధన సమితి పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. వేలాది మంది ఒక్కటై ఉత్తర తెలంగాణకు మెట్రో మార్గాలను రెండో దశలోనే చేపట్టాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పది నెలలుగా కాంగ్రెస్ సర్కారు రెండో దశ మెట్రో ప్రతిపాదనలను అడ్డదిడ్డంగా మార్చడానికి పరిమితమైంది తప్ప.. అంతకు మించి చేసిందేమీ లేదంటూ నగర వాసులు మండిపడుతున్నారు.

### కన్సల్టెన్సీలకు కాసుల వర్షం..

కాంగ్రెస్ ప్రభుత్వం రెండోదశ మెట్రో ప్రాజెక్టు ప్రతిపాదనలను కాలాయాపన చేస్తూ కన్సల్టెన్సీలకు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 4-5 నెలల్లో పూర్తి కావాల్సిన డీపీఆర్‌లు 8 నెలలు గడిచినా పూర్తి కాకపోగా, కొత్తగా మరిన్ని మార్గాలను చేరుస్తూ.. కాలయాపన జరిగేలా చేస్తోందే తప్ప.. క్షేత్ర స్థాయిలో మెట్రో ప్రాజెక్టు పనులు మాత్రం జరగడం లేదు. కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని కన్సల్టెన్సీలకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కట్టబెడుతుందే తప్ప.. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థలో కీలకంగా ఉన్న మెట్రో కారిడార్లను నిర్ణయించడంలో విఫలమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నగరంలో చాలా చోట్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్యలతో నగర వాసులు నిత్యం సతమతమవుతున్నారు. అత్యంత రద్దీతో కూడిన మార్గాల్లో మెట్రో కారిడార్లను నిర్మించాల్సి ఉన్నా, 8 నెలలుగా ప్రతిపాదనల మార్పులు, చేర్పులకే పరిమితమైందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహానగరంలో కొత్తగా నిర్మించాల్సిన మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో అత్యవసరమైన మార్గాలను ఎంపిక చేసుకొని వాటికి డీపీఆర్‌లను రూపొందించి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని నగర వాసులు సూచిస్తున్నారు.


## విద్యుత్ శాఖలో పైరవీలు?

### డిస్కంలో బదిలీల ప్రక్రియ..

#### కోరుకున్న చోటుకు వెళ్లే ప్రయత్నాలు

#### ముగిసిన వెబ్ ఆప్షన్స్

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ చర్చనీయాంశంగా మారింది. కోరుకున్న చోటుకు.. కీలక పోస్టుల కోసం జోరుగా పైరవీలు సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీజీఎస్‌పీడీసీఎల్‌లో ఒకే చోట రెండేండ్లకు పైబడి పనిచేసిన వారినే బదిలీ చేసేలా మార్గదర్శకాలు విడుదల చేశారు. దాని ప్రకారం డిస్కంలోని మొత్తం ఉద్యోగుల్లో 50 శాతం మందినే బదిలీ చేయాలని నిర్ణయించారు. సుమారు 850 మంది ఉద్యోగులు వివిధ హోదాల్లో ఉన్న వారికి వెబ్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించారు. ప్రస్తుతం డీఈ (డివిజినల్ ఇంజినీర్) స్థాయి నుంచి ఏడీఈ, ఏఈ నుంచి కింది స్థాయి వరకు ఉన్న ఉద్యోగులు బదిలీల ప్రక్రియలో పాల్గొన్నారు. అయితే బదిలీలకు సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సోమవారంతో గడువు ముగిసింది. రెండు, మూడు రోజులుగా సర్కిళ్ల వారీగా ఉన్నతాధికారులు బదిలీ ప్రక్రియను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు.



### సచివాలయం కేంద్రంగా..?

ప్రస్తుతం బదిలీల కోసం జరుగుతున్న వెబ్ కౌన్సెలింగ్‌లో ఫోకల్ పోస్టుల చుట్టూనే చర్చంతా జరుగుతున్నది. ఇప్పటి వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేసిన ఉన్నతాధికారులు, తరువాతి స్థాయి ఉద్యోగులైనా ఫోకల్ పోస్టుల్లో పని చేసి ఉంటే.. వారికి బదిలీల సమయంలో వేరే నాన్ ఫోకల్ పోస్టులకు సంబంధించిన ప్రాంతాలే కనిపిస్తున్నాయి. దీంతో మళ్లీ ఎంతో కీలకమైన ఫోకల్ పోస్టును తాజా బదిలీల్లో సాధించే అవకాశం లేకుండా పోతోందని కొందరు మదనపడిపోతున్నారు. మరికొందరు మాత్రం ఇది మంచి విధానమని, ఎలాంటి ఒత్తిళ్లు, పైరవీలకు అవకాశం లేకుండా కంప్యూటరైజేషన్ ద్వారా పారదర్శకంగా బదిలీ ప్రక్రియ జరుగుతున్నదని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్ల పరిధిలోనే పోస్టింగ్ కోసం చూసున్న వారికి ఈ వెబ్ కౌన్సెలింగ్ విధానం అవకాశం ఇవ్వడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో, ప్రాధ్యానత లేని పోస్టుల్లో పనిచేసిన వారికి ఇది మంచి అవకాశమని పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీలకు సచివాలయం కేంద్రంగా మారిందని, అక్కడి ప్రజాప్రతినిధులతో మాట్లాడుకొని కోరుకున్న చోటుకు బదిలీ అయ్యేలా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

## చెరువుల హద్దుల గుర్తింపునకు డిజిటల్ సర్వే



మేడ్చల్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా పరిధి ఓఆర్‌ఆర్ లోపల ఉన్న సుమారు 30 చెరువుల బఫర్, ఎఫ్‌టీఎల్ హద్దులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా డిజిటల్ సర్వే ద్వారా గుర్తిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే బఫర్, ఎఫ్‌టీఎల్‌లలో నిర్మాణాల లెక్క తేలుతుందని చెబుతున్నారు. ఉప్పల్, పీర్జాదిగూడ, బోడుప్పల్ చెరువుల సమీపంలో ఉన్న బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించినా.. మరోసారి డిజిటల్ సర్వే నిర్వహించి గూగుల్ మ్యాపుల్లో పొందుపరుస్తామని చెప్పారు. బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాల ఆధారంగా యజమానులకు నోటీసులు అందిస్తున్నారు. ఇదిలా ఉంటే హైడ్రా పరిధిలోని చెరువులకు మాత్రమే మొదటి దశలో డిజిటల్ సర్వేను నిర్వహిస్తున్నారు. కాగా, మూసీ నిర్వాసితుల వినతులు, సమస్యలను తెలుసుకునేందుకు మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెల్ మూసీ నిర్వాసితులకు ఎలాంటి ఉపయోగం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫోన్ చేస్తే స్పందించడం లేదన్న విమర్శలున్నాయి.

## విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికుల మృతి

### నలుగురికి గాయాలు

మేడ్చల్, అక్టోబర్ 7 : విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికులు చనిపోయారు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...కండ్లకోయ పరిధి హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీ మూత పడటంతో అందులోని సామగ్రిని యాజమాన్యం తరలిస్తున్నది. ఇందులోభాగంగా కార్మికులు సోమవారం ఉదయం పొడుగ్గా ఉన్న నిచ్చెనను తరలించేందుకు సిద్ధమయ్యారు. కార్మికులు 15 ఫీట్లు ఉన్న ఆ ఇనుప నిచ్చెనను ఒక్కసారిగా పైకి ఎత్తి వాహనంలో లోడ్ చేసేందుకు యత్నించారు. ఈ ప్రయత్నంలో పై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలను చూసుకోలేదు. నిచ్చెన కరెంటు తీగలకు తలగడంతో కార్మికులు విద్యుదాఘాతానికి గురయ్యారు. బీహార్‌కు చెందిన చోట పాశ్వాన్(25), గుడు బైట(26), కరం కుమార్(22), లకింధర్ కుమార్(20), పువో మాంజీ(25)లను కండ్లకోయలోని సీఎంఆర్ వైద్య కళాశాలలకు తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన గుడు బైట, పువో మాంజీలకు వైద్యులు సీపీఆర్ చేసి బతికే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకుండాపోయింది. మిగితా వారు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అయితే యాజమాన్యం మొదట ఐదుగురిని ఆస్పత్రికి తరలించి.. ఆ తర్వాత మరో ఇద్దరు కార్మికులను ఒకరి తర్వాత ఒకరిని తరలించడం అనుమానాలను తావిస్తున్నది. అసలు ప్రమాదం ఎలా జరిగింది..? ఆ సమయంలో ఎంత మంది కార్మికులు ఉన్నారు..? పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడించడం లేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు సమగ్ర విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరమున్నదని స్థానికులు కోరుతున్నారు.




*గ్రేటర్‌లో సుమారు 5 లక్షలకు పైగా వీధి దీపాలను నిర్వహించే బాధ్యతలను 2018 నుంచి ఏడేండ్ల పాటు ఈఈఎస్‌ఎల్‌కు అప్పగించారు. 10 శాతం దీపాలు టైమర్ల సహాయంతో ఆటోమెటిక్‌గా ఆఫ్ అవుతున్నాయి. మిగిలిన వాటిని మ్యానువల్‌గానే నిర్వహిస్తున్నారు. అయితే వీధి దీపాల నిర్వహణలో సదరు ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు.*

- నిర్వహణపై తీరు బాగులేదంటూ ఈఈఎస్‌ఎల్‌పై కమిషనర్ ఆగ్రహం
- రూ.80 కోట్ల పెండింగ్ బిల్లులు నిలిపివేత
- కొత్తగా ఏర్పడిన కాలనీల్లో నూతన ఏజెన్సీకి అప్పగించేందుకు టెండర్లు

# గ్రేటర్‌లో అంధకారం

## వెలగని వీధి దీపాలు.. జనానికి ఇక్కట్లు..

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : వెలగని వీధి దీపాలతో భాగ్యనగరంలోని పలు ప్రాంతాల్లో చీకట్లు అలముకున్నాయి. ఐదు లక్షలకు పైగా ఉన్న వీధి దీపాల్లో దాదాపు 35 శాతానికి పైగా పనిచేయడం లేదు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో తరచూ స్ట్రీట్ లైట్లు వెలుగక ఇబ్బందులు పడుతున్నామంటూ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. దీనిపై దృష్టి సారించిన కమిషనర్ ఆమ్రపాలి సదరు నిర్వహణ బాధ్యతలు చూసే ఈఈఎస్‌ఎల్ ఏజెన్సీ ఏ మాత్రం పనితీరు మెరుగుపర్చుకోవడం లేదని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఏజెన్సీ పనితీరులో మార్పు రాకపోవడంతో ఏకంగా రూ. 80కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులను కమిషనర్ నిలిపివేశారు. దీంతో పాటు కొత్తగా ఏర్పాటైన పది కాలనీల్లో వీధి దీపాలను ఏర్పాటు చేసే బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించి, ఈ మేరకు టెండర్లు పిలిచారు.

### 5 లక్షలకు పైగా..

గ్రేటర్‌లో సుమారు 5 లక్షలకు పైగా వీధి దీపాలను నిర్వహించే బాధ్యతలను 2018 ఏప్రిల్ నుంచి ఏడేండ్ల పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్)కు అప్పగించిన సంగతి తెలిసిందే. వీటిలో పది శాతం స్ట్రీట్ లైట్లు టైమర్ల సహాయంతో ఆటోమెటిక్‌గా వెలగడం, ఆటోమెటిక్‌గా ఆఫ్ అవుతుండగా, మిగిలిన వాటిని మ్యానువల్‌గానే మెయింటెన్ చేస్తున్నారు. అయితే నిర్వహణలో ఈఈఎస్‌ఎల్‌పై తరచూ కార్పొరేటర్లు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. ఒకానొక దశలో గత కమిషనర్లు సైతం మందలించారు. ముఖ్యంగా వీధి దీపాల మరమ్మతుల పాలైనప్పుడు మార్చాల్సిన లైటు, ఇతర పరికరాలను సుమారు 15 శాతం రిజర్వ్ పెట్టుకోవాలన్న నిబంధన ఒప్పందంలో ఉన్నప్పటికీ దానిని ఈఈఎస్‌ఎల్ ఏ మాత్రం అమలు చేయడం లేదు. పైగా కొత్తగా పది కాలనీలకు విద్యుత్ సరఫరా మంజూరయినప్పటికీ స్తంభాలు వేసి, కరెంట్ తీగలను లాగడంతో పాటు వీధి దీపాలను బిగించాల్సిన ఈఈఎస్‌ఎల్ పట్టించుకోవడం లేదు.

## గ్రేటర్ @ 31.6 డిగ్రీలు



సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఆవర్తనం బలహీనపడటంతో గ్రేటర్‌లో వానలు తగ్గుముఖం పట్టాయి. కాగా రాగల 24 గంటల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠం 31.6, కనిష్ఠ ఉష్ణోగ్రత 22.3 డిగ్రీలు, గాలిలో తేమ 62శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## మొక్కుబడిగా ప్రజావాణి

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో ప్రజావాణి కార్యక్రమం మొక్కుబడిగా జరుగుతున్నది. దీర్ఘకాలిక, అపరిష్కృత సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎంతో ఆశగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదుదారులకు అధికారుల నుంచే చుక్కెదురవుతున్నది. ప్రజా సమస్యలను స్వీకరించి.. పరిష్కరించి అర్జీదారుల్లో భరోసా నింపాల్సిన అధికారులు.. కంటి తుడుపు చర్యగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కేవలం 90 ఫిర్యాదులను మాత్రమే నేరుగా స్వీకరించారు. ప్రజావాణికి కమిషనర్ ఆలస్యంగా రాగా, ఆ సమయంలోనే అర్జీదారులు పోటెత్తారు. నిర్ణీత సమయం ముగియక ముందే కమిషనర్ కార్యక్రమం నుంచి వెళ్లిపోయారు. యథావిధిగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజావాణికి డుమ్మా కొట్టారు.

